క్లుప్తంగా

సన్మానం



జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు రూరల్: పోలీస్ శాఖలో పదవీ విరమన పొందిన ఉద్యోగులకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదవి విరమణ పొందిన ఆర్ఎస్సైలు రవీందర్, కనకయ్య, సుబ్బారాయుడు, ఎఎస్సైరామకృష్ణ, హెడ్ కానిస్టేబల్ చుక్కయ్యలను ఎస్పీ శబరీశ్ శాలువాలు కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, ఎస్సై శంకర్, స్వామి, సంతోష్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

'ఆరోపణలు చేస్తే ఊరుకోం..'

గోవిందరావుపేట: మంత్రి సీతక్కపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ఊరుకోం అని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మండల యూత్ నాయకుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ములుగు అడవుల్లో ఏముందని అదానీ, అంబానీలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క కమీషన్లు అడుగుతారని ఓ పత్రికపై ధ్వజమెత్తారు. ఆపరేషన్ కగార్ గురించి ప్రశ్నించలేని కొన్ని పత్రికలు కావాలని గిరిజన మహిళ మంత్రి సీతక్కను లక్ష్యంగా చేసుకోని రాయడం దారుణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



చాంద్‌పాషా (ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా (33) మనస్తాపంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాంద్‌పాషా సోదరుడు ఇటీవల మృతిచెందగా తీవ్ర మనోవేదనకు గురైన చాంద్‌పాషా మతిస్థిమితం కోల్పోయాడు. జీవితంపై విరక్తి చెందిన చాంద్‌పాషా ఇంట్లో ఉరివేసుకోని మృతి చెందాడు. మృతుడి తల్లి రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ములుగు రూరల్: జేడీ మల్లంపల్లి మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవనగర్ గ్రామానికి చెందిన బొమ్మరనేని విజయ్(30) కుమారుడితో కలిసి ఈ నెల 28న ద్విచక్రవాహనంపై మల్లంపల్లికి వస్తున్న క్రమంలో కారు ఢీకొట్టింది. ప్రమాదంలో విజయ్‌కి తీవ్రగాయాలు కాగా కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. విజయ్‌ని కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, చికిత్స పొందుతూ మృతి సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా!

- చాలా చోట్ల పేరుకే కిరాణం.. అమ్మేది మద్యం
- మండలంలో దాదాపు 300 బెల్ట్ షాపులు

గోవిందరావుపేట : తాగేందుకు బుక్కెడు నీరు లేని పల్లెలు ఉన్నాయి. కానీ మందు దొరకని గ్రామం మాత్రం ఒక్కటి లేదు. పల్లెల్లో బెల్ట్‌షాపుల దందా జోరుగా సాగుతోంది. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. మండలంలో దాదాపు 300 వరకు బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అప్పులు చేసి తాగడంతో కుటుంబాలు వీధి పాలవుతున్నాయి. బెల్ట్ షాపులు కొనసాగుతూ ప్రజలు మత్తులో చిత్తవుతున్నా నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారి ప్రజలు ఆరోపిస్తున్నారు.



కనీస ఏర్పాట్లు చేయని వైన్స్ నిర్వాహకులు

మండల కేంద్రంలోని వైన్స్ షాపులో కనీస ఏర్పాట్లు లేకపోవడంతో మందు బాబులు మండలం కేంద్రం నుంచి గ్రామాల్లోకి వెళ్లే రహదారుల వెంట కూర్చొని మందు సేవించడం లేదా బెల్ట్ షాపులను ఆశ్రయించడం జరుగుతుంది. దీంతో రహదారి వెంట ప్రయాణించే వారికి ఇబ్బంది కలుగుతుంది. అంతే కాకుండా పొలాల్లో తాగి పడేసిన సీసాలతో ఇబ్బందికి గురవుతున్నామని రైతులు వాపోతున్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు



బెల్ట్ షాపులు నిర్వహించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. వైన్‌షాపు నిర్వాహకులు షాపులో మాత్రమే మద్యం సేవించేలా చర్యలు తీసుకోవాలి. షాపుల ముందు కూర్చొని విషపురుగుల బారిన పడితే షాపు యజమానులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- సుధీర్ కుమార్, సీఐ, ములుగు ఎక్సైజ్ శాఖ

క్వాటర్‌పై రూ.40 ఎక్కువ రేటుకు అమ్మకం

మండలంలోని వైన్‌షాపుల్లో బెల్ట్‌షాపు నిర్వాహకులు కొనుగోలు చేసి ఒక్క క్వాటర్ బాటిల్‌పై రూ.40 ఎక్కువ ధరతో అమ్మకాలు చేస్తున్నారు. పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారు. చాలా మంది పేరుకే కిరాణా షాపులు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో ఘర్షణ పడుతూ అర్ధరాత్రి వరకు నానారభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ, రాష్ట్ర రహదారులకు దూరంగా మద్యం షాపులు ఉండేలా సంబంధిత శాఖ చర్యలు తీసుకున్నారు. ఇంత వరకు బాగున్నా జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి ఉన్న చాలా కిరాణం కొట్టుల్లోనే బెల్ట్‌షాపుల దందా జోరుగా కొనసాగుతోంది.

బురదమయంగా రహదారి



దిగబడిన లారీని బయటకు తీస్తున్న జేసీబీలు



బురదలో దిగబడిన వాహనాలు

రేగొండ: ఓ పక్క బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా ఆదివారం కురిసిన వర్షంతో రోడ్డు బురదమయంగా మారింది. కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండగా రోడ్డు బురదమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల ఈ రోడ్డుపై మట్టి పోశారు. వర్షానికి రోడ్డు బురదమయం కావడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడిపోతున్నారు. సోమవారం ఉదయం ఓ లారీ బురదలో దిగబడటంతో రెండు జేసీబీల సహాయంతో బయటికీ లాగారు. దీంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం మరో వాహనం దిగబడటంతో దారెంబడి వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి బీటీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మల్హర్: దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులు



కాళేశ్వరంలో..

మల్హర్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రం తాడిచర్ల హనుమాన్ సెంటర్‌లో తెలంగాణ ఉద్యమకారులు శాంతియుత దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. ఈ దీక్షా శిబిరంలో బీజేపీ మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు పాల్గొని వారికి సంఘీభావం తెలిపా రు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు బూడిద సతీష్, ప్రధాన కార్యదర్శి బండారి శంకరయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ చాంద్ పాషా, వెంకటస్వామి, సారయ్య, రాజు, కిష్టయ్య, సమ్మక్క, యశోద పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహాదేవపూర్ మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం ఆవరణలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం–టఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యమకారుల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సోమవారం శాంతి యుత దీక్ష నిర్వహించారు. ఉద్యమకారుల దీక్షలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని తమ పూర్తి సంఘీభావం తెలిపారు. టఫ్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఆయూబోద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి ఎండీ అక్రమోద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, నాయకులు ఆన్కారి ప్రభాకర్, జాడి గట్టయ్య, మెసినేని వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మసీద్‌లో పీర్ల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముజావర్(పూజారి) తాజొద్దీన్ మసీద్‌లో పీర్లకు నూతన వస్త్రాలను అలంకరించి దూపాన్ని వేశారు. అలాగే గ్రామ పురవీధుల్లో పీర్లను ఊరేగించడం జరుగుతుందని, మొక్కులు చెల్లించుకోవచ్చని వివరించారు.

దోమల నివారణ మందు పిచికారీ



పిచికారీ చేస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. పేరూరు వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ పంచాయతీల సమన్వయంతో గ్రామంలోని అన్ని ఇళ్లల్లో దోమల నివారణ మందును పిచికారీ చేసినట్లు హెచ్‌ఈఓ వేణుగోపాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బందం రవీందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కమిటీ ఎన్నిక

చిట్యాల: మండలంలోని నైన్‌పాకలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి తెలిపారు. అధ్యక్షుడిగా కంకణాల శంకర్, ప్రధాన కార్యదర్శిగా జంగా కుమార్, ఉపాధ్యక్షులుగా పెండెల భిక్షపతి, నూక వీరన్న, యాదండ్ల మహేష్, సహాయ కార్యదర్శిగా గొడుగు సతీష్, పేరుక రాములు, రమేష్, కోశాధికారిగా చిన్నాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్లబోయిన శివ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు నక్క భాస్కర్, మారెళ్ల దేవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో నిర్లక్ష్యం



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ఎస్‌ఎస్‌తాద్వాయి/ములుగు రూరల్: మండలంలోని కాటాపూర్‌లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరెట్ కార్యాలయంలోని కలెక్టర్ దివాకర్ టీఎస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం కాటాపూర్‌లోని 108 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు అర్హులను ఎంపిక చేసి స్థలాలకు పట్టాలు జారీ చేసిన అధికారులు స్థలం కేటాయింపులో జాప్యం చేస్తున్నారన్నారు. పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలు కేటాయించకుండా ఇబ్బందులను గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా లబ్ధిదారులకు స్థలాలను కేటాయించే విధంగా కలెక్టర్ చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ గౌరమ్మ, నాయకులు దనూక నర్సింగారావు, సాయిలక్ష్మీనర్సయ్య, వహిద్, రాంబాబు, వెంకటేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలి

ఏటూరునాగారం: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ ఇచ్చినందుకు మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌ల చిత్రపటాలకు ప్రజలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఖలీల్, లాలయ్య, నర్సింహరావు, ఎల్లయ్య, జనార్ధన్, కిరణ్, సారక్క పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నాయకులు

మందుబాబులకు అడ్డాగా పాఠశాల

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల ఒకే క్యాంపస్‌లో కొనసాగుతున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై పాఠశాలలో బోధన తరగతులు కొనసాగుతున్న ప్రతిరోజు రాత్రి పాఠశాల ఆవరణ మద్యం ప్రియులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప ఆలయం పాలంపేట పరిధిలోనే ఉండడంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. పాఠశాల ఆవరణలో మందుబాబులు తాగి పడేసిన సీసాల ఫొటో పెట్టి హెచ్‌ఎం పాలంపేట పేరుతో సోషల్ మీడియాలో సోమవారం పోస్ట్ వైరల్ చేశారు. పాఠశాలలో మద్యం సేవించడాన్ని ఖండిస్తూ, ఇది మొదటి తప్పుగా భావించి క్షమించి వదిలివేస్తున్నట్లు హెచ్‌ఎం పాలంపేట పేరు మీద వాట్సాప్ గ్రూప్‌లలో పోస్ట్ చక్కర్లు కొడుతుంది. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంఈఓ ప్రభాకర్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా పాఠశాల ఆవరణలో మద్యం తాగి ఖాళీసీసాలు పడేసిన మాట వాస్తవమేనని, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో పోస్ట్ చేశాడని వెల్లడించారు. ఈ సంఘటనపై వెంకటాపురం పోలీసులకు సమాచారం అందించామని, మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.



పాఠశాలలో తాగి పడేసిన ఖాళీ సీసాలు

9న సార్వత్రిక సమ్మె

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో సోమవారం ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. సింగరేణిలో 44 కార్మిక హక్కులను నాలుగు కోడ్‌లుగా విభజించిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, గోవర్ధన్, రాంబాబు, గణేష్, బాలాజీ, బ్రహ్మాచారి, శ్రీనివాస్, చంద్రయ్య, వెంకటస్వామి, నవీన్ పాల్గొన్నారు.



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మంగపేట: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి తరుణ్



వెంకటాపురం(ఎం): నర్సాపూర్‌లో..

- వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్

వెంకటాపురం(ఎం): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్, నర్సాపూర్, రాజేశ్వర్‌రావుపల్లి గ్రామాల్లో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో 284 మందిని పరీక్షించి 15 మంది జ్వర పీడితులను గుర్తించి వారికి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పార్వతి, డాక్టర్ చందన, ఎంఎల్‌హెచ్‌పి నవీన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మంగపేట: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని మల్లూరు ఎస్సీ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని 45 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న ఏడుగురికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ, సీతమ్మ పాల్గొన్నారు.

చెరుపల్లిలో..

మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని చెరుపల్లి(కొత్తపేట)లో వైద్యాధికారి గోపగాని తరుణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరికి ఆర్‌డీటీ టెస్టు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం మమత, ఆశవర్కర్లు విజయలక్ష్మి, చంద్రవాణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

అందని ‘సర్వే’ వేతనాలు

- సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి ఎనిమిది నెలలు
- ఇప్పటికీ సిబ్బందికి చెల్లించని నగదు

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను గతేడాది నవంబర్‌లో ప్రారంభించి డిసెంబర్ వరకు పూర్తి చేసింది. సర్వేలో పాల్గొని విజయవంతం అవడానికి కృషి చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు మాత్రం ఇప్పటి వరకు గౌరవ వేతనం అందలేదు. దీంతో వారు సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సర్వేలో భాగంగా మొదటి మూడు రోజులు వివిధ శాఖల ప్రభుత్వ, ఒప్పంద ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లు అంటించి కుటుంబాలను గుర్తించారు. అనంతరం ప్రతీ కుటుంబాన్ని కలుస్తూ 75 రకాల ప్రశ్నలకు సమాధానాలు సేకరించి సర్వే చేశారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలోని డేటా ఎంట్రీకి ప్రభుత్వ ఆపరేటర్లతో పాటు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువతను సైతం వినియోగించుకున్నారు. ఒక్కో ఎన్యూమరేటరకు రూ.10వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక కుటుంబం డేటా ఎంట్రీ చేసినందుకు రూ.30 పారితోషికం చెల్లిస్తామని అధికారులు తెలిపారు. సర్వే పూర్తి కాగానే గౌరవ వేతనం సొమ్మును కలెక్టర్ ఖాతాకు జమ చేసి, సంబంధిత సిబ్బందికి అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎనిమిది నెలలవుతున్నా ఇప్పటి వరకూ చెల్లించలేదు. గతంలో అన్ని జిల్లాల డీడీఓల ఖాతాలకు నిధులు జమ చేసినట్లు ఉత్తర్వులు సైతం విడుదల చేశారని, ఆ డబ్బులు ఏమయ్యాయని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.



పిడిసిల్లలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సునీత (ఫైల్)

గౌరవ వేతనం అందించలేదు



నిర్ణీత సమయంలో పని పూర్తి చేసినా గౌరవ వేతనం ప్రభుత్వం అందించలేదు. చాలా ఓర్పుతో అనేక బాధల కోర్చి, పూర్తి వివరాలు సేకరించి బాధ్యతలు నిర్వహించాం. అధికారులకు తమ సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదు.

- వైనాల శివకుమార్, ఇస్సిపేట, ఎన్యూమరేటర్

ఇబ్బంది పడుతున్నాం..



సమగ్ర కుటుంబసర్వేలో వచ్చిన డాటాను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేశా. కానీ ఇప్పటివరకు డబ్బులు రాలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే నగదు విడుదల చేయాలి.

- శిరీష, ప్రైవేట్ డాటా ఎంట్రీ ఆపరేటర్

మండలాల వారీగా సర్వేలో పాల్గొన్న సిబ్బంది

మండలం	ఆపరేటర్ల సంఖ్య	ఎన్యూమరేటర్లు	సూపర్‌వైజర్లు
భూపాలపల్లి	69	99	11
గణపురం	88	109	10
రేగొండ	38	97	13
కొత్తపల్లిగోరి	29	47	8
మొగుళ్లపల్లి	61	80	9
చిట్యాల	70	84	9
టేకుమట్ల	45	50	6
కాటారం	57	89	10
మహాదేవపూర్	66	75	8
మహాముత్తారం	32	62	7
పలిమెల	9	19	4
మల్హర్	52	70	7

నిత్యావసర సరుకుల పంపిణీ

చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో జీపీ సిబ్బంది, ఉద్యోగులు కలిసి బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు రూ.5వేలు విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి అజీర బేగం, ఉపాధ్యాయుడు దశరథం, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రజిత, ఆయా శోభ, సీఏ రాజయ్య, బీపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న జయప్రద